# ★ అంటుజోళ్ళు ★

* రచన: "రంగా వఝుల" *

సీతయ్యకు నాలుగు పెళ్ళిసంబంధాలు కని పెట్టుకుని ఉన్నాయి. పిల్లని చూచిరావాలి. ఏభై ఏళ్ళకిందటి మాట. చెవులకు అంటుజోళ్లు పెట్టుకుని వెడితే బాగుణ్ణని ఒకవేలు విడిచిన మేనమామ కొడుకు నరసయ్యను అంటుజోళ్ళడిగాడు. ఆ వూరి మొత్తంమీద అటువంటి రాళ్ళజోళ్లు లేవు. ఎట్లాగైనా పెళ్ళిచూపులికి వెళ్ళేటప్పుడవి పెట్టుకెడదామని మహా కోర్కిగాఉంది సీతయ్యకు. నరసయ్య మొదట ఇవ్వనన్నాడు. కాని ఒక షరతుమీద ఇస్తానన్నాడు.

"ఏమిటది?"

"పెళ్ళికూతురు చూపులికి నేనుకూడా నీతో వస్తా."

"ఓ దానికేం? ఇంతేగద" అని సంతోషంగా ఆ అంటుజోళ్లు తగిలించుకున్నాడు సీతయ్య.

ఇహ బయలుదేరారు ఇద్దరూ, పెళ్ళిసంబంధపు ఊరికి.

వీళ్లు వచ్చారని, పిల్ల నలంకరించి తీసుకొచ్చి కూర్చుండబెట్టి, అత్తగారు ఆలోచనలో పడ్డది. ఆవిడకు ఇందులో పెళ్ళికొడుకెవరో తెలియలా.

"-ఇందులో పెళ్ళికొడు కెవరండీ"-అన్నారు ఆ కూర్చున్నవాళ్ళల్లో ఒకరు.

◆ ◆ ◆

నరసయ్య "—పెళ్ళికొడు కితడే గాని, ఆ అంటుజోళ్లుమాత్రం ఇతనివి కావు"—అన్నాడు.

సీతయ్య పళ్లు పటపట కొరుకుతూ—

"ఏమిరా దౌర్భాగ్యుడా! అంటుజోళ్లు నావి కావనిపించుకోవాలంటే నీ చెవులికే ఉండనిచ్చే వాణ్ణిగదా. నావే అనుకోడానికి నేను పెట్టుకుంటే, బంగారంవంటి సంబంధం నాశనం చేశావుగదా—" అని నానాచీవాట్లూ పెట్టేడు.

"సరేలే అర్థమైందిలే" అన్నాడు నరసయ్య. ఈ పక్షిని వెంటబెట్టుకెళ్ళడం ఎందుకనుకున్నాడు గాని, చూస్తూ, చూస్తూ, ఆ అంటుజోళ్లు లేకుండా పిల్లను చూడడానికి మనస్కరించడంలా సీతయ్యకి. సరే చెప్పాంగదా, ఎంత గబ్బిలాయైనా ఈమాటు అనడు. అనేదేమిటో మొదటి సంబంధంలోనే అనేశాడు, చివాట్లుకూడా తిన్నాడుగదా అనుకుని, సీతయ్య ఆ వూరినుండి ఇంకో సంబంధపు ఊరు వెళ్లాడు.

నరసయ్య వెంటే ఉన్నాడు. యథాప్రకారంగా, అలాగే పిల్లనలంకరించి తీసుకురావడం వగైరా పరిస్థితులు....

"మీలో పెళ్ళికొడుకు ఎవరండీ?—".

నరసయ్య—"పెళ్ళికొడుకితడే, ఆ అంటిజోళ్లు కూడా ఇతనివే!"

◆ ◆ ◆

"ఓరి, ఛండాలుడా! రెండో సంబంధంకూడా నీకు బలి అయిపోయింది. అసలు అంటుజోళ్ల సంగతి నీ కెందుకంట! సంబంధం నిశ్చయంకాగానే నీకే ఇచ్చేస్తానాయె. అడిగినదానికి సమాధానం చెప్పి, అంటుజోళ్ళ సంగతి నా కెందుకులే అని ఊరుకోరా నీ పుణ్యమైరి, నీకేమైనా ఇస్తాను" అని లేచినవేళ తిట్టుకుంటూ మూడో సంబంధానికి బయలుదేరాడు.

నరసయ్య వెంటే ఉన్నాడు.

"ఈమాటు చూసుకో, వ్యవహారం చెరిపితే అప్పుడను," అని ఆ మూర్ఖుడు దప్పాలుకొట్టి సీతయ్యకు ధైర్యం చెప్పాడు.

మూడో సంబంధం ఒక పోలీసు ఇన్స్పెక్టరు కూతురు. ఆయన అప్పుడింట్లో లేడు.

వియ్యాలవారు వచ్చారని నౌకరు చెబితే ఓ గంటసేపు ముస్తాబుచేసి ధగ్ధపారం పిల్లను ప్రవేశపెట్టారు.

పిల్ల మేనత్త "మీలో ఎవరు పెళ్ళికొడుకు?" అని నరసయ్యనుచూచి అడిగింది.

నరసయ్య అందుకున్నాడు—

"పెళ్ళికొడుకు ఇతడే గాని,ఆ అంటుజోళ్ల సంగతి నాకెందుకు లెండి."

◆ ◆ ◆

వచ్చేస్తూ దోవలో నరసయ్యను చావ చితక పొడిచి, "నీ యబ్బతో చెప్పుకో, పో" అని నాలుగో సంబంధానికి ఒంటరిగాపోయి, సంబంధం కుదుర్చుకొచ్చాడు. —సీతయ్య.